క్లుప్తంగా

వృద్ధులకు పింఛన్లు పంపిణీ

చీరాల రూరల్: ప్రేమ హార్ట్ అండ్ డయాబెటిస్ హాస్పిటల్ అధినేత, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ విస్తర్ల బాబురావు, జాయ్ క్లబ్ ఫ్రెండ్స్ సారథ్యంలో ఆధ్వర్యంలో మంగళవారం జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిస్ చర్చి ఆవరణలో 12 మంది నిరుపేద వృద్ధులకు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున రూ. 6,000 పింఛన్ అందజేశారు. తాను చేసే ఈ చిరు సాయాన్ని అనారోగ్యంగా ఉన్నవారు మందుల కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. అలానే ఈ 12 మంది వృద్ధుల్లో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే తమ ఆస్పత్రికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో జాయ్ క్లబ్ ఫ్రెండ్స్ సభ్యులు కందుల రవికుమార్, బొల్లాపల్లి అనిల్ కుమార్, కనపర్తి బజ్జిబాబు, బొల్లాపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు

బల్లికురవ: పాఠశాలలో విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న ఉపాధ్యాయుడిని కారు ఢీకొట్టటంతో గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం నార్కెట్‌పల్లి-మేదరమెట్ల కాసు బ్రహ్మానందరెడ్డి రోడ్డులోని మండలంలోని కొప్పరపాడు గ్రామ సమీపంలోని వినుకొండ క్రాస్ రోడ్డువద్ద జరిగింది. అందిన సమాచారం మేరకు.. కూకట్లపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బ్రహ్మాచారి విధులు ముగించుకుని అద్దంకి వెళ్తున్నాడు. తమిళనాడు నుంచి హైద్రాబాద్ వెళ్తున్న కారు బైకును ఢీకొట్టడంతో బ్రహ్మాచారి గాయాలపాలయ్యారు. కారు వెనుకనే వస్తున్న మరో బైకు కారును ఢీకొట్టటంతో బైకుపై ప్రయాణిస్తున్న మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఇరువురిని చికిత్స నిమిత్తం అద్దంకి వైద్యశాలకు తరలించారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత

చీరాల అర్బన్: పట్టణ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముందుగా అజెండాలోని 12 అంశాలపై చర్చ నిర్వహించారు. అజెండాలోని 11వ అంశంపై కౌన్సిల్‌లో చర్చ నిర్వహించారు. చీరాలలోని ఐటీసీ కంపెనీకి ప్రతిరోజు 3,20,000 లీటర్ల నీటిని పురపాలక సంఘం ద్వారా అందించేందుకు విషయమై చర్చ నిర్వహించారు. ప్రస్తుతం పట్టణ ప్రజలకు తాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వేసవి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ఇబ్బందులు లేకుండా చూడాలని కౌన్సిలర్లు సూచించారు. కౌన్సిల్ సభ్యుల అందరి ఆమోదంతో అజెండాలోని అంశాలన్నింటిని కౌన్సిల్ ఆమోదించింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగర కొండ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కాకానిపాలెం ప్రభుత్వం బాలుర ఉన్న పాఠశాలతో పాటు మండలంలోని మరో 12 పాఠశాలలో ప్రభుత్వ ఆప్తాల్మిక్ అధికారి ఉమా కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు అవసరమని 350 మంది విద్యార్థులను గుర్తించారు. 29 మంది విద్యార్థులకు పరిమళ ఫౌండేషన్ అధ్యక్షుడు బీవీ కృష్ణారెడ్డి కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలోరోటరీ క్లబ్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీ కృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, వీరయ్య, కొల్లిప రనాగయ్య పాల్గొన్నారు

డెంగీపై అప్రమత్తత అవసరం

అద్దంకి: డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సయ్యద్ హకీం అన్నారు. పట్టణంలోని కాకానిపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో డెంగీ కేసు నమోదు కావడంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం అయ్యిందని డాక్టర్ చెప్పారు. యూపీహెచ్‌సీ పరిధిలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఎబెట్ పిచికారీ, డ్రైనేజీల్లో పూడిక తీయించారు. జ్వరాలపై సర్వే నిర్వహించి ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నవారిని గుర్తించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణాధికారి నీలం రామకోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు వీయూ నరసింహరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

అద్దంకి రూరల్: గుర్తు తెలియని వ్యక్తి ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారు చైను లాక్కుని పరారయ్యాడు. ఈఘటన మంగళవారం రాత్రి అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఓ ఇంటిలో వృద్ధ దంపతులు కిరాణ దుకాణం పెట్టుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలు ఒక్కతే ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైకు మీద వచ్చి కూల్ డ్రింక్ కావాలని అడిగి కూల్ డ్రింక్ తీసుకుని డబ్బులు ఇచ్చాడు. మిగిలిన చిల్లర ఇచ్చేందుకు వృద్ధురాలు గల్లా డబ్బా వద్దకు వంగింది. ఈ సమయంలో వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కుని బైకు మీద ఉడాయించాడు. ఈఘటన నుంచి తేరుకుని వద్ధురాలు దొంగ దొంగ అరవటంతో చుట్టుపక్కల వారు వచ్చి దగ్గర ఉన్న అన్ని వీధులు వెతికినా కనిపించలేదు. ఈఘటనపై ఫిర్యాదు చేసేందుకు స్థానికులు వృద్ధురాలిని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. గతేడాది కూడా ఇదే ఇంటిని లక్ష్యంగా చేసుకుని అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి వృద్ధులపై దాడిచేసి బంగారం, నగదును దోచుకెళ్లారు. మళ్లీ అదే వృద్ధురాలికి మెడలో బంగారం లాక్కుని వెళ్లటంతో పరిసర గృహాలవారు భయాందోళన చెందుతున్నారు.



పూడ్చి వేసిన సాగు కాలువ



కాలువను పరిశీలిస్తున్న ఎన్ఎస్పీ అధికారులు

సాగు కాలువ మాయం

- పరిశీలించిన ఎన్ఎస్పీ అధికారులు
- సాగు కాల్వ సర్వే చేసి, కాలువ ఏర్పాటు చేయాలని రైతుల వినతి

జే.పంగులూరు: కొందరి రైతుల స్వార్థం కారణంగా సాగు కాల్వను మాయం చేశారు. మండల పరిధిలోని జనకవరం గ్రామంలోని పంగులూరు మైనర్ కాలువ పరిధిలోని గ్రామంలోని బోదెకాలవను సుబాబుల్ వేసేందుకు పూర్తిగా పూడ్చేశారు. దీంతో దిగువ పంట పొలాల రైతులకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల క్రితం జనకవరం రైతులు ఎన్ఎస్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంగులూరు మైనర్ కాలవ పరిధిలోని జనకవరం వద్ద కాల్వను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్పీ జేఈ విశ్వమోహన్ మాట్లాడుతూ పంగులూరు మైనర్ కాలవ మొత్తం 7.5 కిలో మీటర్లు ఉందని తెలిపారు. దానిలో 4.5 కిలో మీటర్ వద్ద జనకవరం మైనర్ కాలవ నుంచి ఉత్తరం సాగు కాల్వఉన్నట్లు తెలిపారు. 8 ఎల్‌డీపీ కాల్వను కొందరు రైతులు వారి స్వార్థం కోసం పూడ్చి వేసినట్లు తెలిపారు. కాని ఎన్ఎస్పీ కాలువ మాత్రమే మా పరిధిలోకి వస్తుందని, సాగు కాల్వ రెవెన్యూ పరిధిలో ఉంటుందని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించిన వెంటనే సర్వే చేసి సాగు కాలువను కొలిచి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ సాగు కాలవ కింద గతంలో ఇంచుమించు 200 ఎకరాలు వరకు మాగాణి పండేదన్నారు. వర్షాలు సరిగా పడక సాగరు కాల్వ నీరు రాకపోయేసరికి రైతులు ఎక్కువ భాగం సుబాబుల్ సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే కాలువకు ఎగువ వైపు ఉన్న రైతులు కాలవ పూడ్చి దిగువకు నీరు రాకుండా చేశారని తెలిపారు. గత మూడు సంవత్సరాల నుంచి వర్షాలు పుష్కలంగా పడటంతో నీరు వస్తున్నాయి. దీంతో రైతులు సుబాబుల్ వదిలేసి, మిరప, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. గతంతో దిగువ రైతులందరూ కలిసి జేసీబీతో కాల్వ వేశామని తెలిపారు. కాని ఎగువ రైతులు తిరిగి దానిని మళ్లీ పూడ్చేశారని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించిన సాగు కాలవను సర్వే చేసి కాలువ వేయాలని తెలిపారు. లేకుంటే 100 ఎకరాలు పైనే నీరు అందక ఎండిపోవాల్సిందే అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై మంగళవారం రైతులు తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చారు.

టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



అద్దంకి: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



చీరాల: చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



పర్చూరు: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దర్జీలు

- ఘనంగా టైలర్స్ డే వేడుకలు
- పాల్గొన్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్

అద్దంకి: టైలర్ల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీలో ఆయన మంగళవారం టౌన్, మండల టైలర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ నిత్యం చేతిపని చేసుకుంటూ జీవనం సాగించే టైలర్స్ నిత్య శ్రామికులన్నారు. వారు కుట్టి ఇస్తేనే మనం బట్టలు తొడుక్కోగలుగుతున్నామని చెప్పారు. సమాజానికి వారు చేస్తున్న సేవ మరువలేనిదన్నారు. త్వరలో భవనం నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు, మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, అనంతలక్ష్మి, పార్టీ పట్టణ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేశ్, బాజీవలి, ఎన్ భువనేశ్వరి, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

☛ టైలర్స్ డే సందర్భంగా వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళా టైలర్లను ఘనంగా సన్మానించి అవసరమైన కిట్లు పంపిణీ చేశారు. ఉమా అన్నపూర్ణ, గ్రంధి లక్ష్మీనాగరాజకుమారి, కేబినెట్ ట్రెజరర్ బైసాని వెంకట సుజాత, వాసవి క్లబ్ వనిత ప్రెసిడెంట్ ఆత్మకూరి అంజనేయులు, శిరీష, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

టైలర్ల సేవలు మరువలేనివి..

చీరాల అర్బన్/వేటపాలెం/చీరాల టౌన్: టైలర్ల సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. చీరాల పట్టణ టైలర్స్, వర్కర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాలలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ఎంజీసీ మార్కెట్ వద్ద గల దర్జీ కళాస్థూపం వద్ద టైలర్స్ డే 35వ వార్షికోత్సవం నిర్వహించారు. కుట్టు మిషన్‌ను కనుగొన్న విలియమ్స్ హోవే, టైలర్స్ డే కృషిరత్న కేఎం స్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్జీ పతాకాన్ని బాపట్ల జిల్లా టైలర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ మగ్దూమ్ బాషా ఆవిష్కరించారు. పట్టణ టైలర్స్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఖైజర్, మున్సిపల్ కౌన్సిలర్లు మామిడాల రాములు, చీమకుర్తి బాలకృష్ణ, మల్లెల లలిత తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎన్.వెంకటరమణబాబు, అధ్యక్షుడు షేక్ ఖైసర్, ఉపాధ్యక్షుడు షేక్ నసీబా, కార్యదర్శి రామనాథం నాగరాజు, జాయింట్ సెక్రటరీ కాసాని శ్రీనివాసరావు, కోశాధికారి షేక్ ఆషా, గౌరవ సలహాదారులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

☛ ఈపూరుపాలెం గాంధీ పార్కులో టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ సృష్టికర్త చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టైలర్స్ యూనియన్ ప్రతినిధులు బాషా, భాస్కర్, రాయుడు, కృష్ణ, సాంబయ్య, సురేష్ ఉన్నారు.

☛ వేటపాలెం మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని జబ్బార్ కాలనీలో టైలర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద విలియమ్స్ హోవే, కేఎం స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధరణికోట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎస్‌కే హనీఫ్, సెక్రటరీ షేక్ రహిమాన్, జాయింట్ సెక్రటరీ షేక్ అజీబుల్లా, కోశాధికారి షేక్ సుభానీ, సభ్యులు పాల్గొన్నారు.

పర్చూరు: మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించి బాపూజీ కాంప్లెక్స్ వద్ద జెండా ఆవిష్కరించారు. రోటరీ అధ్యక్ష కార్యదర్శులు నాగభైర శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి దర్జీలను టైలర్స్‌డే సందర్భంగా సన్మానించారు. టైలర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరరావు మాట్లాడుతూ ప్రభుత్వం టైలర్లకు రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టైలర్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి ఏసుబాబు, మండల అధ్యక్షుడు పి.కరిముల్లా, కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, గౌరవాధ్యక్షుడు ఆదాంషఫీ, ఉపాధ్యక్షుడు గాలిబ్, కోశాధికారి చిన్నమీరా పాల్గొన్నారు.

చినగంజాం: టైలర్‌ల సంక్షేమం కోసం కృషి చేసిన మహనీయుడు కేఎం స్వామి అని మండల టైలర్ల సంఘం అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. చినగంజాంలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్ నందు కార్యక్రమం నిర్వహించారు. షేక్ కరిముల్లా, సుభాని ఖాన్,సుల్తాన్ బాషా పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నివేదిక పంపుతాం



మొక్కొజొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

జే.పంగులూరు: మొక్కజొన్న నకిలీ విత్తనాల విషయంపై నివేదిక తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏవో కే సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమంజులూరు గ్రామానికి చెందిన బత్తుల ఆంజనేయులు, కొలకలూరి ఏసోబుకు చెందిన మొక్కజొన్న పొలాలను మంగళవారం మండల ఆయన పరిశీలించారు. నకిలీ విత్తనాల కారణంగా మొక్కజొన్న పైరు ఎదుగు, బొదుగు లేకుండా, పైరు పసుపు రంగులోకి మారి ఆకులు ముడుచుకుపోతున్నాయని, రైతులు నష్టపోతున్నారని సాక్షి పత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన ఏవో గ్రామ రైతులు, రైతు సంఘం నాయకులు వచ్చారు. బాధిత రైతులు వేసిన మొక్కజొన్న భారతి 756 రకం 2, 3 అడుగుల ఎత్తు మధ్యలోనే ఉందని తెలిపారు. దాసరి వెన్ను కూడా వచ్చిందన్నారు. ఈ విధంగా రావడం వల్ల కండే బలహీనంగా ఉండి, దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నివేదిక ఆధారంగా శాస్త్రవేత్తలు పొలాన్ని పరిశీలించి, విత్తనంలో ఏదైనా జన్యుపరమైన తేడా ఉందని గమనించి, ఆ విధమైన రిపోర్ట్ వస్తే రైతులకు వచ్చిన నష్టంపై కంపెనీ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మేదరమెట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఐదు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం మార్చి 24లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ తరువాత బయటకు రావచ్చని, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక పథకాలు కూడా వర్తిస్తాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు పరీక్షలు



పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పర్చూరు: ప్రత్యేక అవసరాల పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. బాపట్ల జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో 200 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పర్చూరులోని వైఆర్ హైస్కూల్‌లో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్ సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త కుంభా నాగేంద్రం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. క్యాంపులో పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి మండలాలకు సంబంధించిన పిల్లలు పాల్గొనగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీవైఈఓ కిరణ్‌కుమార్, ఎంఈవో నాగేశ్వరరావు, హెచ్‌ఎం ఈదర రాజశేఖర్, ఫిజియోథెరపిస్ట్ విజయగీతికా, అప్తామాలజిస్ట్ ప్రతాప్, సైకాలజిస్ట్ చంద్రయ్య, ఆడియాలజిస్టు వెంకటకోటేశ్వరరావు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

అద్దంకి: కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వారు కళాశాలలో ఇంత వరకూ చదివిని అన్ని బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. న్యాక్ గ్రేడ్ తెప్పించడంలో తమ సాయం అందిస్తామని కమిటీ కళాశాల ప్రిన్సిపాల్‌కు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు, పూర్వ విద్యార్థుల సంఘం కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్ రమాదేవి, కార్యదర్శి జ్యోతి రమేశ్, సభ్యులు ఎర్రిబోయిన తిరుపతయ్య, కన్వీనర్ కే ప్రభుదాస్, శ్రావణ్, కళాశాల సీనియర్ అసిస్టెంట్ వందు పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో జీవాల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యురాలు డాక్టర్ పావని సూచించారు. మంగళవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి 59 గేదెలు, 19 దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటుగా క్రమంతప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. రు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఉత్సాహం



కఠారివారిపాలెంలో నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



అద్దంకి: విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈవో



చినగంజాం: విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం



సీవీ రామన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



జే.పంగులూరు: సైన్స్ ప్రాజెక్ట్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న హెచ్ఎం

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- పలు రకాల ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

చీరాల అర్బన్/చీరాల: సమాజానికి ఉపయోగపడే విధంగా సాంకేతికత ఉండాలని, అప్పుడే దానికి సార్థకత ఉంటుందని చీరాల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రవికుమార్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పోస్టర్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు షేక్ బషీర, శ్రీకాంత్, సౌజన్య, శ్రీనివాసరావులు పాల్గొన్నారు. పట్టణంలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో పి.సరోజిని హాజరయ్యారు.

➤ వేటపాలెం మండలంలోని కఠారివారిపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల ప్రయోగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బి.రాణి, ఉపాధ్యాయులు అజయ్‌బాబు, ఎం.షీలాదేవి, కె.రవీంద్రబాబు, పి.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, రోహిణి, పి.చంద్రారెడ్డి, సీహెచ్ విజయలక్ష్మి, పీఎంసీ చైర్మన్ కే నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవిజ్ఞానంపై అవగాహన కల్పించాలి..

కారంచేడు/చినగంజాం: విద్యార్థులకు శాస్త్రవిజ్ఞానంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, యర్రంవారిపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు నేషనల్ సైన్స్‌డే నిర్వహించారు.

➤ పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం దేవదత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్/జే.పంగులూరు: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పంగులూరు మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అనిత విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి బహుమతులు అందించారు.

➤ అద్దంకిలోని కట్టకింద పాలెం ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో రాఘవయ్య, పీఎంసీ సుబ్బారావు, చినబాపూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు వెంటనే మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ అర్జున్‌రావు

అద్దంకి రూరల్: ప్రభుత్వ బ్యాంకు లింకేజీ రుణాలు లబ్ధిదారులకు వెంటనే మంజూరు చేయాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో రుణాల మంజూరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయ సంఘాల ఎస్‌హెచ్‌జీ రుణాలకు సంబంధించిన పొదుపు నగదు ఏళ్ల తరబడి బ్యాంకులో మగ్గుతుందన్నారు. ఆ సొమ్ములో మూడు నెలల కిస్తీల వరకు ఉంచుకుని మిగిలినది గ్రూపు సభ్యులకు అందజేయాలన్నారు. సక్రమంగా చెల్లిస్తున్న జగనన్న తోడు లబ్ధిదారులకు 6వ విడత జగనన్న తోడుతో అదనంగా రుణంలో ఒక వెయ్యి పెంచి ఇవ్వాలన్నారు. జగనన్న బడుగు దీవెన కార్యక్రమంలో లబ్ధిదారులకు వాహనాలు 70 శాతం సబ్సిడీపై ఎస్సీ, ఎస్టీలకు అందిచామన్నారు. నియోజకవర్గంలో రూ. 8.35 కోట్లతో 141 మంది లబ్ధిదారులకు వాహనాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం కృష్ణనాయక్, నాబార్డు డీడీఎం కార్తిక్, ఏడీఏ మోహన్‌రావు, ఐదు మండలాల ఏపీఎంలు, మెప్మా సిబ్బంది, వీవోఏలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి

చీరాల టౌన్: మండలంలోని ఈపూరుపాలెంలో కొలువై ఉన్న అంకమ్మతల్లి వార్షికోత్సవం మంగళవారంతో వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారి గ్రామ పర్యటన, జల బిందెలు, పసుపు కుంకుమ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడకల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపించారు. అనంతరం అంకమ్మ దేవర నగరోత్సవాన్ని బాణాసంచాల కాల్పులు, కనక తప్పెట్లు, కళాకారుల నృత్యాలతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లసేవ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అంకమ్మతల్లిని దర్శించుకోగా ఏర్పాట్లను సేవా భక్తులు పర్యవేక్షించారు.

అక్రమ మద్యం స్వాధీనం

చీరాల: పలు స్టేషన్ల పరిధిలో పోలీసుల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. చీరాల రూరల్, చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం గోవా నుంచి తెచ్చిన మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట పంచాయతీ, ప్రసాద్‌నగర్, వేటపాలెం మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమంగా మద్యం సీసాలను కలిగి ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురి వద్ద నుంచి 58 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ తెలిపారు. అలానే చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం బుర్లవారిపాలెం అడ్డరోడ్డు వద్ద 40 మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.